# దిబ్బపట్టిక

## కొడవటిగంటి కుటుంబరావు



ఇందిరాగాంధీని ఎరిగిన తన్నెరిగిన ఒకతను .గిట్టనివాళ్లు అతన్ని అమెరికా ఏజెంటంటారు. రమ్మంటే ఢిల్లీ వెళ్ళాను. రాజభరణాలు పోతున్నమాట నిజమేనన్న చావుకబురు అక్కడ చల్లగా తెలిసింది. అప్రయత్నంగా నా కళ్ళంట నీళ్లొచ్చాయి. పాపం. ఈ రాజులందరూ ఏమవుతారు! రాజభరణాలే పోతే ఇక సోవియెట్ పరిపాలన రావటం ఇంకెంతసేపు! విప్లవం దొడ్డిదారిన రావటం లేదు గద!

మా దిబ్బరాజుగారు జ్ఞాపకం వచ్చారు. నా కన్నీరు కట్టలు తెంచుకుని ప్రవహించింది. నేనాయన్ను వెంటనేచూసి పరామర్శించాలి. అది నా విధి. ఆయనకు చిల్లరమల్లర సహాయాలు చాలా చేశాను. కాని ఈ గండం తప్పించటం నా చేతిలో ఉన్నట్టుకనబడలేదు. చోవ్హాన్నెరిగిన తన్నెరిగినతనొకడున్నాడు గాని అతడు అతివాద కమ్యూనిస్టుల్లో లెఫ్టిస్టని తెలిసింది. లాభంలేదు.

ఢిల్లీలో నేను చెయ్యగలిగిందేమన్నా ఉంటే తరవాత చూడవచ్చు. ముందు దిబ్బరాజుగారిని పరామర్శించాలి. అందుకని ఏకంగా దిబ్బకు వెళ్ళాను.

తీరా వెళ్ళాక అక్కడ మరో దుర్వార్త చెవిని పడింది. దిబ్బరాజావారు చెవుల పిల్లుల్ని వేటాడబోతే ఎలక కరిచిందట. పిచ్చెలుక కరిస్తే కూడా ప్రమాదమేనేమోనని ఎవరో అంటే దిబ్బరాజావారు అమెరో ఫ్లాట్‌మీద మాస్కో వెళ్ళి అక్కడ చికిత్స పొందుతున్నారట. ప్రమాదం ఏమీలేదని తెలిసింది.

పొలాలు దున్నే తరుణం. ఎడ్లు ఖాళీగాలేవు. అంచేత నేను వెంటనే తిరుగుప్రయాణం కావటం పడలేదు. పోనీ దిబ్బకు వచ్చి చాలా ఏళ్ళయిందిగదా. ఓ రోజుండి ఎరిగిన వాళ్ళందరినీ పలకరించి నింపాదిగా పోదామనుకున్నాను.

కాని అక్కడా పొద్దెదురే అయింది. అంచేతే మనవాళ్ళు కష్టాలు ఒంటరిగా రావంటారు. నేనెరిగినవాళ్ళంతా కలకత్తా, బొంబాయి, బెంగుళూరు, సిమ్లా, మైసూరు, ఊటీ, కొడైకెనాల్, తిరపతి, సింహాచలం, ప్రయాగ, నాసిక్ మొదలైనచోట్లకు వెళ్ళారు. నే నీ మాట ముందే ఊహించి ఉండవచ్చు. దిబ్బప్రభువుగారు లేకపోతే పెద్దలెవరూ దిబ్బమీద ఉండరు. యథా రాజా తథా ప్రజా. ఏమంటారు? ఆ మాటకొస్తే ఢిల్లీలో కూడా అంతే. కిందటిసారి ఢిల్లీ వెళ్ళినప్పుడు ఒక్క అండర్ సెక్రెటరీని కూడా కలవలేకపోయాను. కారణమేమిటంటే ప్రెసిడెంటు దేశాంతరం వెళ్ళారన్నారు.

దిబ్బమీద ఎరిగినవాళ్ళెవరూ లేకపోవటం కూడా ఓ విధంగా మేలేఅయింది. అందుకే— అంటే ఎరిగినవాళ్ళంతా ఎటోవెళ్ళి ఉండటం మూలానే— నేను కర్మాజీని కలవటం జరిగింది. ఆయనద్వారానే నాకు దిబ్బ చరిత్రలోని ఒక ముఖ్యఘట్టం తెలియవచ్చింది.

నిజానికి ఆయన్ను నేను పూర్వం ఒకసారి చూశాను.

"తమర్ని నేను ఒకసారి చూశాను— తమ పరిచయ భాగ్యం కలగలేదుగాని!" అన్నాను. (ఇందులో వ్యాకరణదోషం ఉండదనీ, పరిచయ భాగ్యం నాదేగాని ఆయనదని నా ఉద్దేశంకాదనీ తరువాత తెలిసింది. కాని, సినిమాహీరో తంత్రి లాగా నన్నాయన అపార్థంచేసుకోలేదు.)

"నేనుకూడా తమరినిచూడగానే గుర్తించాను. తమరు మాయింటికి దేవతార్చనకు దయచెయ్యాలి" అన్నాడాయన, పాతమర్యాదలు.

## దిబ్బ పుట్టుక

విజానికి అది దేవతార్చనకాదు. దేవీపూజ. ఆచమనంతో ఆరంభమయింది. మేలుజాతి స్కాచ్ సరుకు.

"దిబ్బలో బియ్యం దొరకటంలేదని విన్నాను. అందరూ జొన్నలే తింటున్నారట!" అన్నాను.

"మనం వరి అన్నమే తింటాంలెండి. ప్రభువువారు ఒక చిన్న పొరపాటు చేశారు. దిబ్బకూ, తిరుగుండానికి కలిపి ఒక రేషనింగా ఫీసు ఏర్పాటు చేస్తామంటే. ఆ ఆఫీసు దిబ్బలో ఉండటానికి సుతరామూ వీల్లేదవటా అనేశారు. తిరుగుండంలో జొన్నపంట జాస్తి. దిబ్బలో వరిపంట జాస్తి. మూడు ఎలెక్షన్లలోనూ అసెంబ్లీ సీటును తిరుగుండంవాడే కాజేస్తున్నాడు. అందుచేత ఆ ఎంపీకి భయపడి రేషనింగాఫీసును. దిబ్బమీద ప్రొక్యూరు చేసిన బియ్యమంతా తిరుగుండానికిచ్చి, ఆ జొన్నలు ఇక్కడికి తరలించేస్తున్నాడు. అంతకంటే మరేమీలేదు." అన్నాడు శర్మాజీ.

"ఇన్నాళ్లూ నేనీ తిరుగుండం గురించి వినకపోవటం ఆశ్చర్యంగా ఉందే!" అన్నాను.

శర్మాజీ నవ్వి. "దిబ్బకు పడమరగా ఉంటుంది. అంతా కలిసి పది చదరపుమైళ్ల, మెరకభూమి. అసలు దిబ్బ పుట్టుక మునుపు అంతా తిరుగుండమే. తమకు తెలియదేమో!" అన్నాడు శర్మాజీ.

"దిబ్బ అనాదిగా ఉన్నది కాదా ఏమిటి!" అని అడిగాను.

"అబ్బే. వీరబాహుగారి దత్తపుత్రుడు ఏకబాహుగారి కాలంలో దిబ్బ ఏర్పడింది. ఏకబాహు అనేది పేరుకాదు. ఆయన అసలుపేరు ఏ రికార్డులోనూ కానరావటం లెదు. తిరుగుండం అనే పెద్ద చెఱువులో వీరబాహుగారు మొసళ్ళను పెంచి, రోజూ స్నానం చేసేటప్పుడు వాటితో ఆడుకొనేవాడుట...ఆ చెఱువును బట్టే దేశానికూడా తిరుగుండం అన్న పేరొచ్చిందను కోండి... ఏకబాహుగారు వింత మనస్తత్వం కలవాడు—ఆ సంగతి ముందు మీకే తెలుసుంది. ఆయనగారు తానుకూడా మొసళ్ళతో ఆడదామని ఎవరూ లేకుండా చిన్నతనంలో తిరుగుండంలో దిగాడు. ఎడమచేతిని మొసలివాతపెట్టి. ఒడ్డుకు ప్రాణాలతో చేరాడు. ఆ ఏకబాహుగారి హయాంలో దిబ్బ ఎర్పడింది." శర్మాజీ.

"అది ఎలా ఏర్పడిందో తమకు తెలుసా! నాకు వినాలని ఉంది." అన్నాను.

"దిబ్బను గురించి పుక్కిటి పురాణం ఒకటి ఉన్నది. అది తమరు వినేఉండవచ్చు" అన్నాడు శర్మాజీ.

తమరు వినే ఉండవచ్చు." అన్నాడు శర్మాజీ.

"లేదు నేనేమి వినలేదు. దిబ్బ అనాదిగా ఉన్నదేనని నేననుకుంటున్నాను." అన్నాను.

"అలా అయితే ముందు ఆ పురాణం చెబుతాను. వీరబాహు తంత్రశాస్త్ర ప్రవీణుడనీ. కాళీ ఉపాసకుడనీ. కొన్నిశక్తులు గలవాడనీ. మదించి ఊరిమీదపడిన ఏనుగును ఆయన తన చూపులతోనే ఆపాడనీ. మొసళ్లేకాదు. ఏ దుష్టమృగమూ ఆయనను చూడగానే గడగడలాడేదనీ చెబుతారు. నిజం కావచ్చు. కాకపోవచ్చు. ఆయనకు తన అవసానం ముందుగానే తెలిసిందట. అప్పుడాయన తన పెంపుడు కుమారుణ్ణి పిలిచి తన పూజలో కూర్చోబెట్టుకుని, కాళీదేవతను ఆవాహన చేసి, "నాయనా, జగదాంబకు నమస్కారం చెయ్యి." అన్నాడట. ఒంటిచేతివాడైన ఏకబాహుకు నమస్కారం ఎలా చేయాలో తెలీక, ఏమీచెయ్యకుండా ఊరుకున్నాట్ట. అప్పుడు అంబ ఏకబాహునూ, అతని రాజ్యాన్నీ శపించిందట. ఆ శాపం తగిలి దిబ్బ ఏర్పడిందని పుక్కిటి పురాణం. ఇది ఎంతమాత్రమూ నిజంకాదు.

"మొదటిసంగతి. దిబ్బ ఏర్పడింది వీరబాహు మరణించినాక నలభై అయిదేళ్ళకు. కాళీదేవీ శాపం అంతకాలం ఎందుకు తగలలేదో ఊహించటం కష్టం. ఏమంటారు?" అన్నాడు శర్మాజీ.

"అసలు జరిగిందేమిటంటారు?" అని అడిగాను.

"ఘోరమే జరిగింది. వీరబాహుగారి హయాం ఉత్తరార్థంలో తిరుగుండం ఆర్థికంగా ఆకాశాన్నంటింది. దేశంలో కూరులు చాలామంది బయలుదేరారు. వాళ్ళు పన్నెండామడ దూరంలో బిడారువెళ్ళినా వీరోచితంగా జయించి ధనరాసులు సంపాదించారు. పొరుగుదేశాలలో ఉండే వర్తకులను రాత్రికి రాత్రే జయించి. తెలవారేసరికల్లా రత్నాలరాసులు తెచ్చుకునేవారు—"

"బందిపోటా ఏమిటి కొంపదీసి?" అన్నాను.

"ఈ నాటి భాషలో అమాటే అనాలేమో. కాని ఆ నాడువారు తాము యోధులమనీ. వీరులమనీ. తాము చేసినవి యుద్ధాలనీ చెబుతున్నారు. ముండమల్లుడనేవాడికి అంకితంగా ముండమయమనే ప్రబంధం రాసిన కవి, తన పోషకుడు యుద్ధాలలో ఎంతమంది శత్రువులను చంపినదీ. ఎంతమంది స్త్రీలను తన కామకళాప్రావీణ్యంతో మెప్పించినదీ పొగడాడు. మనం ఈ నాడు. ముండమల్లుడు ఇంతమందిని హత్యచేశాడనీ. ఇంతమంది స్త్రీలను చెరిచాడనీ అనటం భావ్యంగా ఉంటుందా?" అన్నాడు శర్మాజీ.

"అయినా యుద్ధాలకూ, బందిపోటులకూ ఎక్కువ తేడా లేదేమోలెండి. తరువాత ఏమయింది?" అన్నాడు.

"ఏమవుతుంది? తిరుగుండంలో ఉన్నంత ధనం ఢిల్లీ పాదుషావారి ఖజానాలోకూడా లేదన్న మాట పుట్టింది. అయితే. ఇంత సంపన్నమైన రాజ్యంలోకూడా దరిద్రులు ఉంటూ వచ్చారు. కటిక దరిద్రులు. ఇది. ప్రజారంజకుడైన వీరబాహును చాలా బాధపెడుతూ వచ్చింది. తన రాజ్యంలో ఇళ్ళులేనివాళ్లూ, బట్టలు లేనివాళ్లూ. తిండి లేనివాళ్లూ ఉండటమేమిటని ఆయన ఊహూ ఇదై పోయాడు.


### శుభవార్త

★

డాక్టర్లకు సాధ్యంగాక వదలివేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. లావుపాటివారు సన్నగను, బలహీనులు బలవంతులుగను చేయబడుదురు. మధుమేహము, రక్తపుపోటు, కుష్ఠు, బొల్లి, కేన్సర్, క్షయ, సంతానము లేనివారు కూడా శ్రీ యోగిగారిచికిత్స వలన సంపూర్ణఫలమును బడయగలరు. కావలసిన వారికి కాయకల్ప చికిత్స చేయబడును ఈ చికిత్సవలన దేహములో వున్న వ్యాధులు తొలగిపోవుటయే గాక నూతన యౌవనము కలుగును. వివరములు కోరువారు పోస్టు ఖర్చులకు ఒక రూపాయి పంపవలయును.

శ్రీ యోగాశ్రమము
పెదవాల్తేరు పోస్టు,
విశాఖపట్టణము

తిరుగుండంలో అమలులో ఉండిన డబ్బు నాణాలుగురించి తాను క్లుప్తంగాచెప్పాలి. ఆ నాణాలు బంగారంతోనూ. వెండితోనూ. రాగితోనూ చేసేవారు. ఇంచుమించు మూడు ఒకే ప్రమాణంలో ఉండేవి— ఈ నాటి పైసలకు సుమారు రెట్టింపు ఉండేవి. అవి నా దగ్గర ఎక్కడోఉండాలి. తరువాత తీసి చూపిస్తాను.

"చిత్తగించారా! బంగారు నాణాలను వరహాలు, వరాలూ అనేవారు, అవి గొప్ప కుటుంబాలవారివద్దనే ఉండేవి. మధ్యరకం, అంగారకం వాళ్ళదగ్గిర నూలు కలిపి స్తేచాలు. తీవ్రమైన శిక్షపడేది.

"పోతే, వెండి నాణాలున్నాయి చూశారూ, వాటిని కోరలనేవారు. సామాన్యంగా ఏ వస్తువు ధర చెప్పినా ఇన్ని కోరాలని చెప్పటం రివాజుగా ఉండేది. ఎవణ్ణి గురించైనా మాట్లాడేటప్పుడు "కోరలుగలవాడా, కోరల్లేనివాడా!" అని అడగటం పరిపాటే.

"ఇక రాగినాణాలను కోరికలు అనేవారు. అవి కేవలం పేదవాళ్ళదగ్గిరే ఉండేవి. అందుకే సన్యాసం పుచ్చుకున్నవాళ్ళు, బైరాగులైపోయిన వారు, ''నాకు ఒక్క కోరికాలేదు," అనటం ఆచారంగా ఉండేది. డబ్బుకోసం పాపిష్టి పనులు చెయ్యటం అందరూ నిత్యమూ ప్రత్యక్షంగా చూసేదేనాయే. అందుచేత ఒక్క కోరికైనాలేని వాళ్ళు మహా పుణ్యాత్ములుగా భావించబడేవారు.

రాజుగారు తన పుట్టిన రోజున అందరికీ దానాలు చేసేవారు. పుట్టినరోజు ఇంకా నెల రోజులుందనగా ప్రజలందరూ పుట్టినరోజునిధికి తమ శక్తికొద్దీ చందాలు వేసేవారు. దానినే రాజుగారు పుట్టిన రోజున అందరికీ తిరిగి దానం చేసేవాడు. మరీ గొప్పవాళ్ళకు రాజుగారు వరాలిచ్చేవాడు. మధ్యరకం వాళ్లు "నీకెన్ని కోరలొచ్చాయి?" అని ఒకరినొకరు అడుక్కునే వాళ్లు. ఇక అలగా జనానికి కోరికలు మాత్రమే లభించేది.

"ఇక అసలు విషయానికి వస్తాను. వీరబాహు తన ప్రజలు దారిద్ర్యంతో సతమతం కావటం ఎంతమాత్రమూ ఇష్టం ఉండేదికాదు. డొక్కలు అంటుకుపోయిన మగాడుగాని, నేవళంగా అవయవాలులేని ఆడదిగాని, ఒక పూరిగుడిసెగాని కంటబడితే ఆ మహారాజుగారి ప్రాణం తల్లడిల్లిపోయేది, అటువంటి దృశ్యాలు తనకంట పడకుండా ఆయన ఎన్నో కట్టుదిట్టాలు చేశాడు. కాని ప్రయోజనం లేకపోయింది. ఆయన న్యాయవిచారణకు కూర్చుంటే కవాల్లాంటి ముద్దాయిలువచ్చి ఎదురుగా నిలబడేవారు. దారిద్ర్యానికీ నేరాలకూ ఏదో గట్టిసంబంధమే ఉన్నదని ఆయన ఏ పుస్తకాలూ చదవకుండానే తెలుసుకున్నాడు. అందుకు మనం ఆయన్ని మెచ్చుకోవాలి.

''ఒకసారి ఏం జరిగిందంటే, ఒక వర్తకుణ్ణి హత్యచేసి, అతడి భార్యను చెరిచి. ఆ వర్తకుడి ధనమంతా అపహరించాడనే నేరం కింద ఒక ఆజానుబాహువును విచారణకు తెచ్చారు. అతన్ని చూసి రాజుగారు, 'ఈమనిషి ధనవంతుడుగానూ ఆరోగ్యవంతుడుగానూ ఉన్నాడు. ఇటువంటి వాడు నేరాలుచెయ్యటం అసంభవం. ఇతన్ని వదిలిపెట్టెయ్యండి' అన్నాడు. అటువంటి మేధావి ఏకబాహు.

''ఏళ్ళు గడుస్తున్నకొద్దీ ప్రజల దారిద్ర్య సమస్య మహారాజును మహా బాధపెట్టసాగింది. దేశంలో దరిద్రులనదగిన వారు ఎందరున్నారు? దారిద్ర్యం అన్నదానికి ప్రమాణం ఏమిటి?




మీ కేశ సంపదకు

జుట్టు అద్భుతంగా ఉండేటట్టు చేసేది రీటా-దానిలో అటువంటి శక్తీ, సువాసనా ఉన్నాయి - శిరోజాలు సహజంగా, చక్కగా పెరగడానికి. చల్లదనానికి. దానికదేసాటి.

రీటా వాడి మీ కురుల సౌభాగ్యాన్ని వృద్ధి చేసుకొండి. మీ శిరోజాలు ఏపుగా, ఒత్తుగా పెరిగి నిగనిగలాడుతూ మెత్తగా ఉంటాయి.

* సరికొత్త ప్యాకింగులో వస్తున్నది




రీటా

రీటా ప్రతీ చోటా దొరకును

రీటో కంపెని, బొంబాయి . కలకత్తా . మద్రాసు

దిబ్బ పుట్టుక

అన్నివిషయాలను గురించి ఆచూకీలు తీయించాడు.

"ఆర్థిక ప్రవీణులు చాలారోజులు కూర్చుని చర్చించి. రోజుకొక పోరఅయినా సంపాదించలేనివాడు దరిద్రుడనీ. అలాంటి దరిద్రులు దేశంలో నూటికి తొంభై ఇద్దరున్నారనీ మహారాజుకు తెలియజేశారు.

ఈమాట వినగానే మహారాజుగారి గుండెలు అవిసిపోయినంతపని అయింది. 'ఇంత దారిద్ర్యాన్ని ఎలా పరిష్కరించటం?' అని ఆయన పెద్ద పెట్టున తెంగపడిపోయాడు.

"ఏకబాహుని దగ్గర ఉన్న ముగ్గురు మంత్రులలో కలికేశ్వరుడనేవాడొకడుండేవాడు. వాడు అప్పటికే తన సన్నిహితులతో 'మళ్ళా ఎక్కడా అనకండి. నే నేక లాఖ్య వతారాన్ని' అంటూండేవాడట రాజుగారు తన మంత్రులతో. "మీలో ఎవరు నా ప్రజల దారిద్ర్యాన్ని పోగొట్టే ఉపాయం చెబితే వారిని ప్రధాన మంత్రిగా చేసి. జీతం రెట్టింపుచేసి తిరుగుండ భూషణ బిరుదు ఇస్తాను. 'అన్నప్పుడు కలికేశ్వరుడు ఆ అవకాశాన్ని వినియోగించుకున్నాడు. అతను ఆ రాత్రే రాజుగారివద్దకు వెళ్ళి "మహారాజా. మన ప్రజల దారిద్ర్యాన్ని నిర్మూలించటానికి బ్రహ్మాస్త్రంలాంటి ఉపాయాన్ని నేను చెబుతాను. అన్నాట్ట.

"రాజుగారు ఎగిరిగంతేసి. "ఏమిటా ఉపాయం?" అని అడిగాట్ట. కలికేశ్వరుడు చెప్పాడు. అది నిజంగానే తేలికైన ఉపాయం. దేశ జనాభాలో 92 శాతంగా భాసించే పరమ దరిద్రులందరికీ భారీగా పన్నులు వెయ్యటమూ. అవి చెల్లించని వాళ్ళను ఉరి తీయించటమూను. పన్నులు ఎలాంటివంటే: గుడిసె పన్ను అరవై కోరలు. చింకి చొక్కా పన్ను నూరుకోరలు; కుండల వంటపాత్రల పన్ను ఎనభై కోరలు- ఇలా.

"రాజుగారికి పద్ధతి నచ్చింది. ఆయన కలికేశ్వరుడి జీతాన్ని పెంచి: క్రొత్త పన్నులను టముకు వేయించాడు. పన్నులు చెల్లించని వాళ్ళకు మరణ దండన. సకుటుంబంగా మరణ శిక్ష.

"టముకు వింటూనే తిరుగుండం విడిచి పారిపోయిన వాళ్ళు కొద్దిమంది మాత్రమే. అధిక సంఖ్యాకులు అనాడూ, ఏనాడూకూడా రాజకీయ జడులే. అందుచేతవారు రచ్చబండల్లో సమావేశాలు జరిపి. ఈ పన్నులు అక్రమమా, కాదా అన్న అంశాన్ని గురించి ఉద్రేకరహితంగా చర్చించారు. కొందరు ఉద్రేకపడి క్రొత్త శాసనాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తే అది రాజభక్తి కాదని మిగిలినవాళ్ళు మందలించారు. ఈ శాసనాన్ని ప్రతిఘటించాలని అన్న ఒకే ఒకవ్యక్తిని ఆ రాత్రే కాళీ దేవతకు బలిఇచ్చేసి. వాడి మాంసాన్ని లాంఛనగా తలా కాస్త ప్రసాదం కింద తిన్నారు.

"తీరా ఉరిశిక్షలు అమలుకావటం ఆరంభ మయాక పారిపోవ యత్నించినవాళ్ళు కొంద రున్నారు. కాని సరిహద్దులో భటులను కాపలా ఉంచి-చీఫ్ మినిష్టర్ డెజిగ్నేట్ కలికేశ్వరుడు. వారిని పట్టుకుని ఉరితీయించాడు. ఈ సంగతి తరువాత తెలిసి ఏకబాహు చాలా నొచ్చుకున్నాడు దరిద్రులు చచ్చిపోయినా, దేశం వదిలిపోయినా ఒకటేగద. కలికేశ్వరుడు అనవసర రక్తపాతం చేయించాడు.

"ఇందుకు రాజుగారు నొచ్చుకున్నాడేగాని కలికేశ్వరుణ్ణి తీవ్రంగా ఆక్షేపించలేదు. ఎందుచేతనంటే ఆ కలికేశ్వరుడు తిరుగుండం చరిత్రలో ఒక సువర్ణ యుగానికి పునాది రాయి వేస్తున్నాడు. త్వరలోనే తిరుగుండంలో దరిద్రుడుండడు. అందరూ సంపన్నులేగల రాజ్యం ప్రపంచంలో ఎక్కడవున్నా ఉంటే అదే తిరుగుండమే! ఎంతకీర్తి! ఈ సువర్ణయుగం తన హయాంలోనే ఆరంభంకావటం ఎంత గొప్ప!

"మొత్తంమీద దేశమంతటాకలిసి ఓ ముప్ఫై లక్షలమంది పిల్లలూ, పెద్దలూ, స్త్రీలూ, పురుషులూ ఉరిశిక్షపొందారు. వారి శవాలన్నిటినీ వరస దిబ్బలలో పాతేశారు. ఈ ఉరిశిక్షలు అమలుజరుగుతున్న కాలంలోనే కొద్ది మంది సంపన్నులు తిరుగుండాన్ని విడిచి, ఎక్కడికో వలస పోయినట్టు ఏకబాహు మహారాజావారికి తెలియవచ్చింది. ధనికులకు మహోజ్వలమైన భవిష్యత్తు ఉండబోతున్నదనీ, కోరలుగల వాళ్ళెవరూ దేశంవిడిచి పోనవసరంలేదనీ రాజుగారు మరొక చాటింపు వేయించారు. ఆ తరవాత ధనికులెవరూ తిరుగుండాన్నివిడిచి వెళ్ళిపోయినట్టు తెలియరాలేదు. చాటింపు పనిచేసి ఉండవచ్చు"

"తరువాత ఏమయింది?" అని అడిగాను.

"ఏమవుతుందో మీరు ఊహించలేరా? రాజశాసనం పూర్తిగా అమలుజరిగాక తిరుగుండంలో ఒక్క రైతుగాని, కుమ్మరిగాని, కమ్మరిగాని, పాకీవాడుగాని, చెప్పులు కుట్టేవాడుగాని, చాకలిగాని, మంగలిగాని, అంట్లు తోమే మనిషిగాని. ఏ పనిచేసే మనిషిగాని మిగలలేదు. అన్ని వృత్తులవాళ్ళూ చచ్చారు. లేదా పారిపోయారు. ఎవరి శ్రమమీదనైతే తిరుగుండం పూర్తిగా ఆధారపడిఉందో వారంతా కోరలులేనివాళ్ళే! కోరలున్నవాళ్ళకు జానెడు నూలుదారం తియ్యటంకూడా చాతకాదు. ఇలా జరగబోతుందని ఊహించిన బుద్ధిమంతులైన ధనికులు దేశంవిడిచి పారిపోయారు. పారిపోని వాళ్ళుపడ్డ అగచాట్లు ఒక్కటైనా ఊహించుకోవచ్చు. ముందు చచ్చినవాళ్ళను తరువాత చచ్చేవాళ్ళు పాతేశారు. దిబ్బలు అపారంగా పెరిగాయి. పొలాలన్నీ దిబ్బేసిపోయాయి. కాలక్రమాన ఇళ్ళకూలి దిబ్బేసిపోయాయి... ...

అయ్యా. అలా ఏర్పడింది దిబ్బ.

"తరవాత. ఎక్కడనుంచో జనంవచ్చి దిబ్బలులేని పడమర ప్రాంతంలో స్థిరపడ్డారు. వాళ్ళు ఆ ప్రాంతాన్ని తిరుగుండమనే అంటూ వచ్చారు. దిబ్బమీద క్రమంగా మనుషులు చేరి మరొకరాజ్యం ఏర్పరుచుకున్నారు. అది దిబ్బరాజ్యంగా చరిత్ర కెక్కింది. దీనికి కూడా ఎంతో భవిష్యత్తు ఉంటుందనీ తోచదు. కారణాలు నన్ను అడక్కండి." అని శర్మాజీ ముగించాడు.

మేం ఈ లోపల రెండు సీసాలు ఖాళీచేసి. భోజనానికి లేచాం. ●


**1968-69 లో మీ అదృష్టము**

మీరు ఒక పోస్టుకార్డు మీద ఏ పుష్పం పేరైనా వ్రాసి మీ అడ్రసు తెలుపండి. మేము మీకు రాబోయే పన్నెండు నెలలలో జరుగు ముఖ్యసంఘటనలు- అనగా వ్యాపారంలో లాభ నష్టాలు,



సర్వీసులో ప్రమోషన్, ట్రాన్సఫర్లు. పిల్లల జననం, వివాహం, సుఖ సంతోషాలు మరియు చెడునక్షత్రాలకు శాంతి చేసుకొను విధానాలు రు. 1.81 లకే పంపెదము. పోస్టేజి అదనం. ఒక తడవ చూసిన తృప్తిచెందగలరు.

**PT. DEV DUTT SHASTRI**
RAJ JYOTISHI (A.J.W.)
P.B No. 86 JULLUNDUR CITY